క్లుప్తంగా

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

పెండ్లిమర్రి : మండలంలోని గొందిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని గొందిపల్లె, బాలయ్యగారిపల్లె, రామచంద్రాపురం, ఇందిరానగర్ గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

ముద్దనూరు : మండలంలోని రాజులగురువాయిపల్లె గ్రామంలో నేడు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగప్రసాద్

కొండాపురం : గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు ఎంపీపీ లక్ష్మీదేవి ఆదేశించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించినట్లు ఎంపీడీఓ నాగప్రసాదు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అజెండాలోని అంశాల వారిగా శాఖల వారిగా అధికారులు వివరించాలన్నారు. వ్యవసాయ అధికారి ఏఈఓ రమేష్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రైతుభరోసా పథకం ద్వారా రూ.7,500 నగదు జమచేశామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే రైతులకు వేరుశనగ విత్తనకాయలను సబ్సిడీతో రైతులకు అందజేశామన్నారు. విద్యుత్ సమస్యలు ఉంటే సంబంధి శాఖ అధికారులు పట్టించుకోలేదని గ్రామ సర్పంచ్ రాఘవేంద్రరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. టి. కోడూరులో నీటిసమస్యతోపాటు వీధిలైట్లు లేవని సభ దృష్టికి ఎంపీటీసీ ఎల్. రామమునిరెడ్డి తీసుకొచ్చారు. త్వరలోనే పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ ప్రసాదు తెలిపారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ శోభనబాబు, సర్పంచ్‌లు శివారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు

తాళ్ల ప్రొద్దుటూరులో జూనియర్ కళాశాల ప్రారంభం

కొండాపురం : తాళ్లప్రొద్దుటూరులో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నూతనంగా బాలికల జూనియర్ కళాశాల మంజురైనట్లు ప్రిన్సిపాల్ సాంబశివారెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని పదవ తరగతిలో పాసైన బాలికలు వచ్చి జూనియర్ కళాశాలలో చేరాలన్నారు. ప్రవేట్ కళాశాలలకు ధీటుగా విద్యబోధన అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని బాలికలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిన్నారులకు తల్లిపాలు శ్రేయస్కరం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

చింతకొమ్మదిన్నె : పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని రోడ్డు కృష్ణాపురం క్లస్టర్ సూపర్ వైజర్ లక్ష్మీ తెలిపారు. బుధవారం మండలంలోని రోడ్డు కృష్ణాపురం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పుట్టిన రోజు నుంచే తల్లిపాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లో గురువారం ఉదయం జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బండి వీరారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలకు ఎంపిక చేయడం జరిగింది. వీరిలో లావణ్య, అమ్మజాన్, చందన, చిరు నాయక్‌లకు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు బహుమతులు అందజేస్తారన్నారు.

మానవత్వంలో ప్రథమస్థానంలో ఉండాలి

కడప కల్చరల్: మానవతను చాటుకోవడంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నెంబర్ వన్ గా నిలవాలని కలెక్టర్ ఓఎస్‌డీ రఘునాథ్ అన్నారు. బుధవారం స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన మానవతా సంస్థ నగర కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగర కమిటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితరులు తమ హయాంలో సాధించిన పనులను గురించి వివరించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సంస్థను దేశమంతటా విస్తరింపజేయాలని, సంపూర్ణ సేవాభావం గల సభ్యుల వల్ల ఇది సాధ్యమవుతుందని చెప్పారు.

మాయ మాటలకు ఎవరూ మోసపోవద్దు

ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొండాపురం : రాబోవు ఎన్నికల్లో చంద్రబాబు చెప్పే మాయ మాటలకు ఎవరూ మోసపోవద్దని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పొట్టిపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలపై ఆరాతీశారు. సమస్యలు ఉన్న చోట సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీలను 98 శాతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారన్నారు. చంద్రబాబునాయుడు ప్రజలను మభ్య పెట్టి మోసపూరిత హమీలను ఇస్తున్నారని ఆయన విమర్శించారు. పొట్టిపాడు గ్రామంలో ప్రజలు ఎస్.తిమ్మపురం గ్రామంలో నుంచి పొట్టిపాడు గ్రామం వరకు రోడ్డు అధ్వానంగా ఉందని రోడ్డు వేయించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకోచ్చారు. త్వరితగతిన రోడ్డు వేయిస్తానని ఆయన హమీఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతరాజారెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, నవజ్యోతురెడ్డి, చింత సాయిరెడ్డి, పెద్దిరెడ్డి, శేఖర్, శ్రీరంగనాథరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

కమలాపురం : మండల పరిధిలోని కొండాయపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారామలక్ష్మణ హనుమత్సమేత దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతున్న ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బండలాగుడు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన నగదు బహుమతులు అందజేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బండ లాగుడు పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతి ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి రూ.1లక్ష నగదు బహుమతి అందజేశారు. అలాగే వరుసగా రూ.80వేలు, రూ.60వేలు, రూ.40వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతులు అందజేశారు. ఆలయ ప్రతిష్ట మహోత్సవాలకు హాజరైన సీకేదిన్నె జడ్పీటీసీ నరేస్ రామాంజులరెడ్డికి నిర్వాహకులు మహేశ్వర్‌రెడ్డి, మైసూరారెడ్డిలు పూలమాలతో సత్కరించారు. ప్రతిష్ట మహోత్సవాలకు వినియోగించాలని రూ.30వేల నగదును నిర్వాహకులకు నరేస్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, కొండారెడ్డి పుత్తా మధు, మహమ్మద్ సాదిక్, లక్ష్మీ నారాయణరెడ్డి, నిఖిల్‌రెడ్డి, విజయేంద్రారెడ్డి, మర్రి సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీల విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

విద్యాభివృద్ధికి బంగారు బాటలు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి బంగారు బాటలు వేస్తోందని జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ నర్రెడ్డి భారతి అధ్యక్షతన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశపెట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఎదిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వీరారెడ్డి, ఎంపీటీసీ భారతి, వార్డు సభ్యుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వ్యాపారాలు చేసుకునేందుకు సువర్ణ అవకాశం

పులివెందుల టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల ప్రాంతాన్ని అత్యంత అధునాతన సౌకర్యాలతో వ్యాపార సముదాయాలను నిర్మించడం జరిగిందని.. ఇందులో వ్యాపారాలు చేసుకునేందుకు వ్యాపారస్తులు దరఖాస్తులు చేసుకోవచ్చునని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి కాంప్లెక్స్ గదుల వివరాలను తెలియజేస్తూ.. పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా అధునాతన భవనాలైన సిటీ సెంట్రం (ఓల్డ్ బస్టాండు), షాపింగ్ కాంప్లెక్స్(ఓల్డ్ మార్కెట్), నగరవనం (రాణితోపు), శిల్పారామం (రింగ్ రోడ్డు), మీట్‌అండ్ ఫిష్ మార్కెట్, న్యూ ఆర్టీసీ బస్టాండులలో ఉన్న కాంప్లెక్స్‌లలో షాపులు, ఫంక్షన్ హాల్స్‌లో వ్యాపారాలు నిర్వహించేందుకు ఆసక్తి గల వ్యాపారస్తులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీన శనివారం మున్సిపల్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 99631 70177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

క్రీడల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె : అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచినట్లు డైరెక్టర్ కె.సంధ్యారాణి పేర్కొన్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీవరకు ఆర్జీయూకేటీ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీలలో ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు క్రికెట్‌లో విజేతగా నిలవగా.. వాలీబాల్, కబడ్డీలలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను డైరెక్టర్‌తోపాటు అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఏఓ రామభూపాల్‌రెడ్డి, పీడీలు రమణారెడ్డి, బాల ఓబయ్య, శంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్

జగనన్న విద్యా కానుక విద్యార్థులకు వరం



విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న నరేస్ రామాంజులరెడ్డి

చింతకొమ్మదిన్నె : జగనన్న విద్యా కానుక విద్యార్థులకు వరం అని సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేస్ రామాంజులురెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని జె కొత్తపల్లె పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. మండలంలో 4414 మంది విద్యార్థులకు నాలుగో విడత జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి , ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, సర్పంచ్‌లు మల్లిఖార్జున యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు. ఎంఈవో వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండలాగుడు పోటీలు

వేముల : మండలంలోని చాగలేరు గ్రామంలో బండలాగుడు పోటీలను బుధవారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడ్డిలు ప్రారంభించారు. స్థానిక చాగలేరు ఎస్సీ కాలనీలో సీతారాముల లక్ష్మణ హమమత్ ఆలయం నూతనంగా నిర్మించారు. ఈ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని నిర్వాహకులు దేశవు ఎద్దుల బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. వేంపల్లెకు చెందిన రమణయ్య 4288 అడుగులు, పెర్నపాడుకు చెందిన రామాంజనేయులు ఎద్దులు 4132 అడుగులు, బ్రాహ్మణపల్లెకు చెందిన చిన్నపుల్లారెడ్డి ఎద్దులు 3755 అడుగులు, సిద్దాలాపురంకు చెందిన పోలన్న ఎద్దులు 3365 అడుగులు, వేల్పులకు చెందిన వెంకట నాగిరెడ్డి ఎద్దులు 3332 అడుగులు, జమాల్‌పల్లెకు చెందిన ఓబు కృష్ణయ్య ఎద్దులు 2698 అడుగులు, అంకాలమ్మగూడూరుకు చెందిన అంకిరెడ్డి ఎద్దులు 2509 అడుగులు, తాళ్లపల్లెకు చెందిన జయరామిరెడ్డి ఎద్దులు 2250అడుగులు లాగాయి. ఈపోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ, 5వ, 6వ, 7వ, 8వ స్థానాలలో నిలిచిన ఎద్దులకు రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ.10వేలు, రూ.8 వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులను మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ బయపురెడ్డిలు ప్రదానం చేశారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

పులివెందుల నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డిలు తెలిపారు. బుధవారం మండలంలోని చాగలేరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పాడా నిధులతో నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటును వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ వాసులకు వాటర్ ప్లాంటు నిర్మాణంతో సురక్షిత తాగునీటి సమస్య తీరిందన్నారు. కాలనీలో సుమారు 200 కుటుంబాలు ఉన్నాయని.. వారందరికి సురక్షిత నీరు అందిస్తారన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్ల ద్వారా సురక్షిత నీరు ప్రజలకు అందించడం జరుగుతోందన్నారు. అనంతరం కాలనీ వాసులు ఇన్‌చార్జి, జెడ్పీటీసీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, ఎంపీటీసీ లక్ష్మీదేవి, మాజీ ఎంపీటీసీలు చంద్రశేఖరరెడ్డి, మల్‌రెడ్డి, సర్పంచ్ అర్జున్, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



బండలాగుడుపోటీలను పప్రారంభిస్తున్న మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి

ఆన్‌లైన్ ద్వారా బిల్డింగ్ ప్లాన్ అనుమతులు

వేంపల్లె : గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ ద్వారా బిల్డింగ్ ప్లాన్ అనుమతులు మంజూరు చేయాలని అన్నమయ్య అర్బన్ డెవెలప్‌మెంట్ ఏపీఓ కృష్ణసింగ్ సూచించారు. బుధవారం వేంపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 1 నుంచి గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్‌లో బిల్డింగ్ ప్లాన్ అనుమతులను చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అయితే గ్రామ పంచాయతీల్లో ఈ విధానాన్ని అమలు చేయలేదన్నారు. ఇకనుంచైనా కచ్చితంగా బిల్డింగ్ ప్లాన్ అనుమతులను ఆన్‌లైన్ విధానంలోనే కొనసాగించాలన్నారు. మాన్యువల్ ప్రకారం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అప్రూవల్ లేని లేఔట్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓ సుబ్బారెడ్డి, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

చెన్నూరు : స్థానిక సచివాలయం 3లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గంగనపల్లి సురేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆధార్ కేంద్రం నందు ప్రజలకు అన్ని సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో గురువారం జరిగే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంఈఓ జాఫర్ సాదిక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా సముచిత రీతిలో సత్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

పులివెందుల రూరల్ : రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో వారు రక్తదాతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. తల్లి జన్మనిస్తే రక్తదాత పునర్జన్మనిస్తారన్నారు. రక్తదాన శిబిరాలు ఉద్యమంలా సాగాలన్నారు. ఇలాంటి సేవలు మరిన్ని చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ వెంకటసుబ్బయ్య, ఏఓ నాగలక్ష్మి, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : అన్నిదానాల్లోకెల్లా రక్తదానం గొప్పది అని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రక్తనిధి మెడికలాఫీసర్ శుభశ్రీ హాజరై మాట్లాడుతూ రక్తహీనత నివారణకు జంక్ ఫుడ్ మానేసి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆపదలో ఉన్న వారికి ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ బాలనారాయణ, సేవా సమితి అధ్యక్షుడు రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురం : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ కళాశాలలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో కళాశాలకు చెందిన విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారిని ఆయన అభినందించారు.



సన్మాన రక్తదాతలతో అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, తదితరులు

విజ్ఞాన, వినోదాలకు వేదికలు శిక్షణ శిబిరాలు

● కలెక్టర్ విజయరామరాజు

కడప కార్పొరేషన్: విద్యార్థుల్లో విజ్ఞాన, వినోద, నైపుణ్యాలను పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బుధవారం సాయంత్రం కడప మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. కడప నగరపాలక సంస్థ, ఆర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ విజయరామరాజు దంపతులు, మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో నిరంతరం పాఠ్యపుస్తకాలతో కుస్తీలు పడే విద్యార్థులకు ఏడాదికి ఒక్కసారి వచ్చే వేసవి సెలవులు వారి ఆటపాటలకు, ఆట విడుపునకు చక్కటి వేదికలవుతాయన్నారు. వేసవి ఎండల్లో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా నగరపాలక సంస్థ వారు ప్రారంభించిన వేసవి శిక్షణ శిబిరాల్లో వారికి నచ్చిన పలు అంశాల్లో ఆయా విభాగాల్లో నిష్ణాతులైన ట్రినర్లతో నైపుణ్య శిక్షణ అందివ్వడం ద్వారా విద్యార్థులు వినోదం, ఆనందంతో కూడిన విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని సొంతం చేసుకున్నారన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణలో ఆర్తి ఫౌండేషన్ వారు అందించిన సహకారం అభినందనీయమన్నారు. కమిషనర్ ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ ఈ వేసవి సెలవుల్లో నిర్వహించిన శిక్షణా శిబిరాలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఇకపై ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులకు ఆటవిడుపుతోపాటు వారిలో ఉన్న కళాత్మక నైపుణ్యాలను వెలికితీసి, వారి అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ఆర్తి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

19న చలో కలెక్టరేట్

జమ్మలమడుగు : చేనేత కార్మిక సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 19వ తేదిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చేనేత కార్మిక సంఘం నాయకులు బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. ఈనెల 19న జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి జిల్లాలోని చేనేత కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి కొండాపురం రైల్వే స్టేషన్‌లో ధర్మవరం ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్

కడప కోటిరెడ్డి సర్కిల్ : మచిలీపట్నం- ధర్మవరం , ధర్మవరం -మచిలీపట్నం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు (17215, 17216) గురువారం నుంచి కొండాపురం రైల్వే స్టేషన్‌లో ఆగుతుందని కడప రైల్వే స్టేషన్ మేనేజర్ డి. నరసింహారెడ్డి తెలిపారు. ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగర శివార్లలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 19 నుంచి గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు.18 నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. 30 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని వివరించారు. అలాగే దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం

పులివెందుల రూరల్ : చుక్కల భూముల సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించిందని మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డిలు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో చుక్కల భూములకు సంబంధించి రైతులకు హక్కు పత్రాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 130 మంది రైతులకు చెందిన 174.50 ఎకరాలకు గానూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు చుక్కల భూమి నుంచి శాశ్వతంగా విముక్తి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చుక్కల భూమి ద్వారా సమస్యలు తలెత్తకుండా వాటిని పరిష్కరించడం జరిగిందన్నారు. దీనివల్ల రైతులు తమ భూమిని రిజిష్టర్ చేయించుకోవచ్చునన్నారు.

చుక్కల భూమి సమస్య నుంచి విముక్తి

వేంపల్లె : ఎన్నో ఏళ్లుగా రైతులు ఇబ్బందులు పడుతున్న చుక్కల భూమి సమస్య నుంచి విముక్తి చెందినట్లు జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో చుక్కల భూములకు సంబంధించిన పత్రాలు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేంపల్లె మండలానికి సంబంధించి 468మంది రైతులకు 750 ఎకరాల చుక్కల భూమి సమస్య నుంచి ఎలాంటి సమస్య లేకుండా క్రయ విక్రయాలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సుమారు రూ.20కోట్ల విలువ చేసే చుక్కల భూముల సమస్య నుంచి రైతులు విముక్తి చెందారన్నారు. రైతులు తమ భూములకు సంబంధించి పత్రాలు వీఆర్‌ఓల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.



రైతుకు హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్

చుక్కల భూమి పట్టాలు పంపిణీ

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డిల చేతులమీదుగా బలపనూరు, లోమడ, దిద్దేకుంట్ల, కసనూరు, నిడివెల్ల గ్రామాలకు చెందిన 218 మంది రైతులకు 473 ఎకరాల భూమికి సంబంధించి భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ వెంకటరెడ్డి, ఆర్ఐ షేక్షా, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

నేడు చుక్కల భూముల రైతులకు సమావేశం

లింగాల : స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో గురువారం ఉదయం చుక్కల భూముల రైతులకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మీ నారాయణ, డీటీ త్రిభువన్‌రెడ్డిలు తెలిపారు. మండలంలో 311 మంది రైతుల 608.03 ఎకరాల చుక్కల భూములు ఉన్నాయని.. ఇటువంటి రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ అమృత, జెడ్పీటీసీ పుష్ప, మండల నాయకులు పాల్గొంటారని.. చుక్కల భూముల రైతులు విధిగా హాజరు కావాలన్నారు.